ప్రజా మంటలు
బుధవారం 19 - 08 - 2026

# రోడ్డు ప్రమాదం లో జగిత్యాల పట్టణం కీ చెందిన యువకుడు మృతి



**వెల్గటూర్ ఆగష్టు 18 ( ప్రజా మంటలు ) :** ఉద్యోగం కోసమని హైదరాబాద్ వచ్చాడు.. కల నేరవేరకుండానే ఇలా..హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్‌పై వేగంగా వచ్చిన ఓ యువకుడు నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో అప్ప జంక్షన్ వద్ద బైక్ అదుపుతప్పడంతో డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడు జగిత్యాల జిల్లాకు చెందిన వికాస్‌గా గుర్తించారు.సాయంత్రం బయటకు వెళ్లొస్థానని చెప్పి ఓ యువకుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిన ఘటన హైదరాబాద్ నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల ప్రాంతానికి చెందిన బండా వికాస్ ఇటీవలే బీటెక్ పూర్తి చేశాడు. అయితే ఉద్యోగం కోసమని హైదరాబాద్ వచ్చిన వికాస్ సన్‌సిటీలో తన మిత్రులతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. అయితే ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన వికాస్.. అప్ప జంక్షన్ వద్ద అదుపుతప్పి డివైడర్‌ను కొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల కారణంగా వికాస్ అక్కడికక్కడే మృతి చెందాడు.ప్రమాదాన్ని గమనించిన వాహనదారులకు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే అక్కడికి చేరుకున్న నార్సింగి పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.అయితే కొడుకు మరణవార్త విన్న వికాస్ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. సిటీకి వెళ్లి కొడుకు.. ఉద్యోగం చేసి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి వెళ్తాడు అనుకుంటే.. ఏకంగా తిరిగిరాని లోకాలకే వెళ్లిపోవడంతో ఆ తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు.

## కోటిలింగాల పార్వతి కోటేశ్వర స్వామి వారి సన్నిధిలో మొదటి అడిషనల్ జిల్లా జడ్జి సునీత రవీందర్ రెడ్డి ప్రత్యేక పూజలు





**వెల్గటూర్ ఆగష్టు 18 ( ప్రజా మంటలు ):** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల గ్రామం లో కొలువు తీరిన పార్వతి కోటేశ్వర స్వామి వారినీ మంగళవారం ఉదయం వేళలో స్వామి వారినీ దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేయడం జరిగింది.ఆలయ అర్చకులు, వేద మంత్రాల మధ్య ఘన స్వాగతము పలికి ఆశీర్వచనం ఇవ్వడం జరిగింది. ఆలయ అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ, అన్వేష్ శర్మ,కార్తీక్ శర్మ, ఆలయ అధికారులు,ఉత్సవ కమిటీ వారు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి





**వెల్గటూర్, ఆగష్టు 18 (ప్రజా మంటలు):** తెలంగాణ వీర చరిత్రలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ప్రత్యేక స్థానం ఉందని ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి వేముల నాగలక్ష్మి అన్నారు. అణగారిన వర్గాల హక్కులు, సామాజిక సమానత్వం కోసం పోరాడిన పాపన్న గౌడ్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ధర్మపురిలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న వేముల నాగలక్ష్మి, ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాటి సామాజిక అసమానతలు, దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసి, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన గొప్ప యోధుడు సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. గౌడ కులంలో జన్మించినప్పటికీ ఆయన పోరాటం ఒక్క కులానికే పరిమితం కాలేదని, సమాజంలోని అన్ని వర్గాలకు న్యాయం, గౌరవం, సమాన హక్కులు దక్కాలనే లక్ష్యంతో పోరాడారని తెలిపారు.సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజల ఐక్యత కోసం సర్వాయి పాపన్న గౌడ్ చూపిన మార్గంలో నేటి తరాలు ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. ఆయన పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.ఈ కార్యక్రమంలో ధర్మపురి గౌడ కులం అధ్యక్షులు నర్సాగౌడ్, మండల అధ్యక్షులు ఎల్లా గౌడ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు గడ్డం బాల గౌడ్, ఎంపీటీసీ గంగాధర్‌తో పాటు ధర్మపురి పట్టణ ప్రజలు, గౌడ కులస్తులు, ఇతర ప్రముఖులు పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలను స్మరించుకున్నారు.

## గొల్లపల్లి మండల కేంద్రంలో సర్దార్ పాపన్న గౌడ్367 వ,జయంతి



**గొల్లపల్లి అగస్ట్ 18 ప్రజా మంటలు :** తెలంగాణ వీర చరిత్రలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ప్రత్యేక స్థానం ఉందని గీత కార్మికుల గౌడ సంఘం అధ్యక్షుడు గుండా గంగాధర్,అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటి సామాజిక అసమా నతలు, దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసి, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన గొప్ప యోధుడు సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. గౌడ కులంలో జన్మించినప్పటికీ ఆయన పోరాటం ఒక్క కులానికే పరిమితం కాలేదని, సమాజంలోని అన్ని వర్గాలకు న్యాయం, గౌరవం, సమాన హక్కులు దక్కాలనే లక్ష్యంతో పోరాడారని తెలిపారు.సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజల ఐక్యత కోసం సర్వాయి పాపన్న గౌడ్ చూపిన మార్గంలో నేటి పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.ఈ కార్యక్రమంలో గీత కార్మికుల అధ్యక్షులు గుండా గంగాధర్ గౌడ కులస్తులు, వార్డ్ సభ్యులు గీతా కార్మికులు ఇతర కుల సంఘాల నాయకులు ప్రముఖులు పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలను స్మరించుకున్నారు.

## సర్దార్ పాపయ్య గౌడ్ విగ్రహ ఆవిష్కరణ

**పాల్గొన్న జీవన్ రెడ్డి, దావ వసంత**



**రాయికల్ , ( ప్రజా మంటలు) ఆగస్ట్ 18:** జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ పాపయ్య గౌడ్ విగ్రహాన్ని మంగళ వారం మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ తాటిపర్తి జీవన్ రెడ్డితో కలిసి జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం పెద్దలు, మండల నాయకులు, అల్లిపూర్ గ్రామ పాలక వర్గం, గ్రామ ప్రజలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ విద్య బలోపేతం దిశగా అడుగులు




**గొల్లపల్లి, ఆగస్టు 18 (ప్రజా మంటలు):** ఇంటర్మీడియట్ విద్యను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల్లో ఆచరణాత్మక, గుణాత్మక మార్పులు తీసుకువచ్చే ప్రయత్నంలో భాగంగా ఈ సంవత్సరం నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంటర్నల్ అసెస్‌మెంట్ విధానంలో కొన్ని మార్కులు కేటాయిస్తున్నారు. తద్వారా విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించే దిశగా ఇంటర్మీడియట్ బోర్డు అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది.ఇప్పటికే రెండు విడతల్లో కొన్ని సబ్జెక్టులకు సంబంధించి ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులకు సీనియర్ అధ్యాపకుల ఆధ్వర్యంలో డిజిటల్ ఎడ్యుకేషన్ విధానంలో ఇంటర్మీడియట్ బోర్డు సమకూర్చిన ఫ్లాట్ ప్యానెల్స్ ద్వారా శిక్షణ అందించారు.మూడో విడతలో భాగంగా మ్యాథమెటిక్స్, హిందీ సబ్జెక్టులకు సంబంధించి జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం, మంగళవారం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులకు శిక్షణ అందిస్తున్నారు.ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాధికారి వై. రమేష్ బాబు, శిక్షణ కోఆర్డినేటర్, కళాశాల ప్రిన్సిపల్ డి. నాగభూషణం ప్రారంభించారు.ఈ సందర్భంగా వై. రమేష్ బాబు మాట్లాడుతూ అధ్యాపకులు నిరంతరం తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించి, వారి అభిరుచులకు అనుగుణంగా ప్రోత్సహిస్తూ నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు.విద్యార్థులు కూడా అధ్యాపకుల సూచనలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, రాబోయే పరీక్షలకు తగిన విధంగా సిద్ధమై మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చెందిన 27 మంది శిక్షణ పొందుతున్న అధ్యాపకులు, నలుగురు శిక్షణ పొందిన డీఆర్‌పీలు పాల్గొన్నారు.

# భర్త చావు... అన్న-వదిన దోపిడీ...! ఆస్థి కోసం కన్నేసిన ప్రభుత్వ టీచర్లు

**ఆస్థి పత్రాలు,15 తులాల బంగారం లాక్కున్నారని ఆరోపణ..!**

**"బిడ్డ భవిష్యత్తు కోసం కనికరించండి".. సార్**

**- జిల్లా కలెక్టర్ కు వింతంతువు వేడుకోలు**



**ధర్మపురి / జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) ఆగస్ట్ 18:** గుండెపోటుతో భర్తను కోల్పోయిన బాధ ఒకవైపు, మరోవైపు కట్టుకున్న వారే ఆస్తి కోసం గొంతు పిసుకుతున్నారనే భాధ ఇంకొక వైపు. ఓ వింతంతువు మానసిక క్షోభను అనుభవిస్తు మానవత్వానికే మాయని మచ్చగా మిగిలిన ఈ ఘటన జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలో చోటుచేసుకుంది.ఈ విషయమై జగిత్యాల జిల్లా కలెక్టర్ కు తన కూతురు చిన్మయితో కలిసి వింతంతువు మానస న్యాయం చేయాలనీ జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు.మానస తెలిపిన వివరాల ప్రకారం....ధర్మపురికి చెందిన దహగాం గిరీష్ 2025 ఏప్రిల్ 18న అకస్మాత్తుగా గుండెపోటుతో కన్నుమూశారు.భార్య మానస, 10 ఏళ్ల కూతురు చిన్మయి అనాథలయ్యారు. ఈ విషాదాన్ని కూడా లెక్క చేయకుండా గిరీష్ అన్న దహగాం గణేష్, వదిన కాసర్ల లావణ్య ఆస్తిపై కన్నేశారు. ఆస్తి పత్రాలు, బంగారం బందీ,గిరీష్ పేరున ఉన్న పొలం పత్రాలు, ఇంటి పత్రాలతో పాటు సుమారు 15 తులాల బంగారాన్ని కూడా వారు బలవంతంగా తమ వద్ద ఉంచుకున్నారని మానస ఆరోపించారు. "అక్కా, భావ అని కాళ్లు పట్టుకుని బతిమాలాను. నా బిడ్డ చదువు కోసం, భవిష్యత్తు కోసం ఇవ్వమని వేడుకున్నాను. కానీ కనీసం కనికరం కూడా చూపలేదు" అంటూ మానస గుక్కపెట్టి ఏడ్చారు.ఇక్కడ అసలు ట్విస్ట్ ఏంటి అంటే.... ఆరోపణలు ఎదుర్కొంటున్న గణేష్ ధర్మపురిలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా, తోటి కోడలు కాసర్ల లావణ్య జగిత్యాల రూరల్ మండలం కల్లెడ జిల్లా పరిషత్ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తూ ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. పిల్లలకు విలువలు నేర్పాల్సిన వారే, ఓ వితంతువును, చిన్నారిని వేధిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.ఎక్కడా న్యాయం జరగకపోవడంతో విసిగిపోయిన మానస, కూతురు చిన్మయితో కలిసి నేరుగా జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. "మాకు న్యాయం చేయండి సార్. ఆస్తి పత్రాలు, బంగారం ఇప్పించండి" అంటూ వినతిపత్రం అందజేశారు.

**న్యాయ నిపుణులు ఏమంటున్నారు...**

హిందూ వారసత్వ చట్టం 1956 ప్రకారం భర్త చనిపోతే ఆస్తిలో భార్య, పిల్లలదే మొదటి హక్కు అన్నారు. అన్నకు ఎలాంటి వాటా ఉండదని, అలాగే స్త్రీకి ఇచ్చిన బంగారం "స్త్రీధనం" కిందకు వస్తుందని, దాన్ని ఎవరూ అడ్డుకోలేరని, బాధితులు వెంటనే పోలీస్ కంప్లైంట్, రెవెన్యూ అధికారుల ద్వారా వారసత్వ సర్టిఫికేట్, డీ ఎల్ ఎస్ ఏ ద్వారా ఉచిత న్యాయ సహాయం తీసుకోవచ్చని చెబుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కాబట్టి డీఈఓ కు ఫిర్యాదు చేయాలని వారు సూచిస్తున్నారు.భర్త లేని లోటును భర్తీ చేయకుండా, ఉన్న కొద్దిపాటి ఆస్తి కోసం సమాజానికి దిక్సూచిగా ఉండాల్సిన ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా వేధించడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనపై జిల్లా అధికారులు స్పందించి తక్షణ న్యాయం చేయాలని మానస కోరుతున్నారు.

## తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మాడుగుల రాములు నియామకం



**కరీంనగర్, ఆగస్టు 18 (ప్రజా మంటలు):** తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సుదీర్ఘకాలంగా ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై పోరాడుతున్న మాడుగుల రాములును నియమించినట్లు సంఘం నాయకులు తెలిపారు.మాడుగుల రాములు గతంలో డీటీఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా, తెలంగాణ జేఏసీ కరీంనగర్ జిల్లా కో-చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణ ఉద్యమంలోనూ ఆయన క్రియాశీల పాత్ర పోషించారు.తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం. రవీందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరీష్ కుమార్ రెడ్డి మాడుగుల రాములు నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసినట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు, ముఖ్య సమన్వయకర్త మహమ్మద్ ఫయాజ్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా మాడుగుల రాములు మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల సాధనకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు సంఘటితంగా పోరాడటం తప్ప మరో మార్గం లేదన్నారు. ఉద్యోగులను ఐక్యంగా సమీకరించి వారి కనీస హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.తనపై నమ్మకంతో రాష్ట్ర బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు ఎం. రవీందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరీష్ కుమార్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు, ముఖ్య సమన్వయకర్త ఎం.డి. ఫయాజ్ అలీకి మాడుగుల రాములు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## కొండగట్టు వద్ద ప్రమాద స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ

**ప్రమాదానికి గల కారణాలపై ఆరా**

**సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఆదేశాలు**



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ప్రజా మంటలు, ఆగస్ట్ 18:** కొండగట్టు వద్ద కరీంనగర్--జగిత్యాల ప్రధాన రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాద ఘటన స్థలాన్ని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సోమవారం పరిశీలించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, రహదారి పరిస్థితి, వాహనాల కదలిక, వాహన వేగం తదితర అంశాలపై సంబంధిత పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను అన్ని కోణాల్లో విచారించి, సమగ్ర దర్యాప్తు చేపట్టాలని, దర్యాప్తును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రమాదానికి సంబంధించిన ప్రతి అంశాన్ని పరిశీలించి, వాస్తవాలను వెలికితీసే విధంగా దర్యాప్తు చేపట్టాలని అధికారులకు సూచించారు. వాహనదారులు అధిక వేగంతో వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముందున్న వాహనాలను ఓవర్ టేక్ చేసే సమయంలో జాగ్రత్తగా నడుపుతూ, ముందున్న వాహనాలకు తగిన దూరం పాటించాలని కోరారు. ప్రధాన రహదారులపై మరింత అప్రమత్తంగా ప్రయాణించాలని తెలిపారు.ఎస్పివెంట డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, డి.టి.ఓ. మహమ్మద్ సందాని, మల్యాల సీ.ఐ రాజ్ కుమార్, జాతీయ రహదారి అదికారులు ఉన్నారు.

## బల్కంపేటలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

**పాల్గొన్న మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి**



**సికింద్రాబాద్, ఆగస్టు 18 (ప్రజా మంటలు):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని బల్కంపేట్‌లో మంగళ వారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆలియా మధు గౌడ్, దాసరి విజయ్ కుమార్ గౌడ్, పద్మల నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎన్డీఎంఏ మాజీ ఉపాధ్యక్షులు, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు మర్రి శశిధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆయన, అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మర్రి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ... బహుజన రక్షకుడు, వీరయోధుడు సర్వాయి పాపన్న గౌడ్ సమాజానికి అందించిన సేవలు అసమానమైనవని కొనియాడారు. నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాట పటిమ, ఆశయాలు నేటి యువతరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షుడు బి. శ్యామ్ సుందర్ గౌడ్, బీజేపీ యువ నాయకుడు మర్రి పురూరవ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నెమలి ఆనంద్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీశైలం గౌడ్, నాయకులు నక్క శ్రీనివాస్ గౌడ్, కొత్తపల్లి రాజు గౌడ్, కందుకూరి అనిల్ కుమార్ గౌడ్, దశరథ్ గౌడ్, ప్రవీణ్ కుమార్ గౌడ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సామాజిక న్యాయానికి స్ఫూర్తి 'సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్'

**- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**కలెక్టరేట్ లో జయంతి వేడుకలు**



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు), ఆగష్టు 18 :** జగిత్యాల జిల్లా కలెక్టరేట్ లో మంగళ వారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సామాన్య కుటుంబంలో జన్మించి, తన కాలంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను ప్రశ్నిస్తూ, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరుడిగా చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని అన్నారు.పాపన్న కేవలం ఒక యుద్ధ వీరుడు కాదు. కోటలను జయించిన సైనిక నాయకుడిగా మాత్రమే ఆయనను చూడటం ఆయన చారిత్రక ప్రాధాన్యతను పరిమితం చేయడమే అవుతుంది. గోల్కొండ కోటను ఏలిన బహుజన చక్రవర్తిగా వివిధ సామాజిక వర్గాలకు చెందిన ప్రజలను సమీకరించి, అప్పటి ఆధిపత్య వ్యవస్థలను సవాలు చేసిన ప్రజా నాయకుడిగా ఆయన తెలంగాణ ప్రజల జ్ఞాపకాల్లో చిరస్థాయిగా నిలిచారు. ఆయన గాథలో ఆత్మగౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజా భాగస్వామ్యం, అధికారంలో భాగస్వామ్యం వంటి విలువలు అంతర్లీనంగా కనిపిస్తాయి.17వ శతాబ్దంలోనే సామాజికంగా వెనుకబడిన, అణగారిన వర్గాల ప్రజలను ఏకం చేసి తన పోరాటానికి పునాది వేసిన పాపన్న... అధికారం కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమై ఉండాల్సిన అవసరం లేదని తన కార్యాచరణ ద్వారా చాటిచెప్పిన ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందారని అన్నారు.ఈసందర్భంగా ఆయన పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. ఎస్ లత, బి. రాజ గౌడ్, డి ఆర్ వో ప్రసాద్, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది, కుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

## అర్బన్ హౌసింగ్ కాలనీని పరిశీలించిన

**జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే**



**జగిత్యాల అర్బన్, ( ప్రజా మంటలు) ఆగస్ట్ 18:** జగిత్యాల అర్బన్ హౌసింగ్ కాలనిలో అపరిశుభ్రత పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ దృష్టికి రాగా జగిత్యాల మున్సిపల్ నుండి 8 జేసీబీ లు 8 బ్లేడ్ ట్రాక్టర్ లు, 120మంది మున్సిపల్ లేబర్ లతో మంగళ వారం పారిశుధ్య పనులు చేపట్టారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ లు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులకు పలు సూచనలు చేశారు. ఆలయాలు, చర్చి, మజీద్, శ్మశాన వాటిక ల అభివృద్ధి కి కృషి చేస్తున్నామని తెలిపారు. డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని అన్నారు.విద్య అభివృద్ధి కి తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు, 6.5కోట్ల తో ప్రధాన రహదారి నిర్మాణం చేసే విదంగా కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజా గౌడ్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, ఆర్డీవో మధుసూదన్, కమిషనర్ సత్య ప్రణవ్, హౌసింగ్ డి.ఈ. భాస్కర్, డీఎస్పీ పురుషోత్తం, కౌన్సిలర్ లు చీటి లక్ష్మీనారాయణ, రామకృష్ణ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కోలగాని సత్యం, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సమైక్య భవనానికి ఎమ్మెల్యే భూమి పూజ



**జగిత్యాల రూరల్ , ( ప్రజా మంటలు) ఆగస్ట్ 18:** మండలంలోని నర్సింగ పూర్ గ్రామంలో 10లక్షల నిధులతో శ్రీ లక్ష్మి మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ మంగళ వారం భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు గాజంగి నందయ్య, ఎఎంసి చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, సర్పంచ్ వంశీ , ఉప సర్పంచ్ సంతోష్, సమిండ్ల శ్రీనివాస్, ఎంపిడిఓ రమాదేవి, తహసీల్దార్ హకీమ్, ఎంపీవో రవి బాబు, మాజీ సర్పంచులు బాల ముకుందం, సరోజన, మల్లారెడ్డి, నరేష్, సర్పంచులు గంగమల్లయ్యా, ప్రకాశ్, మాజీ ఎంపీటీసీ లు కూడుకల లక్ష్మణ్, రాజ నర్సయ్య, ఏఈ విజయ్, ఎపియం రాజు, తిరుపతి, శేఖర్ రెడ్డి, మహిళ సంఘ నాయకులు దివ్య, భాగ్య లక్ష్మి, పద్మ, గడ్డం లక్ష్మి, వార్డు సభ్యులు, నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

